క్లుప్తంగా

ట్రస్ట్ సేవలు అభినందనీయం


చదరంగ పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి

గూడూరురూరల్: అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి అన్నారు. పట్టణంలోని డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో బుధవారం అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అండర్–15 చదరంగ పోటీలను డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి ప్రారంభించారు. డీఎస్పీ మాట్లాడుతూ సాధారణ కుటుంబంలో పుట్టిన అబ్దుల్ కలాం కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదిగి దేశానికి విశేష సేవలందించారని గుర్తు చేశారు. విద్యార్థులు చిన్నతనం నుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకుని సాధించేందుకు కష్టపడాలని సూచించారు. సీఐలు హజరత్‌బాబు, దశరథరామారావు, ట్రస్ట్ నిర్వాహకులు తాజుద్దీన్, అరవ పార్వతయ్య, నరేంద్ర, గోపి పాల్గొన్నారు.

నేడు మర్లపల్లిలో గడప గడపకు..

నాయుడుపేటటౌన్: మర్లపల్లి, అన్నమేడు గ్రామాల్లోని కాలనీల్లో గురువారం ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య గడప గడపకు మన ప్రభుత్వం జరుగుతుందని రూరల్ జేసీఎస్ కన్వీనర్ ఓట్టురు కిషోర్ యాదవ్ బుధవారం తెలిపారు. మర్లపల్లిలో ఉదయం 6 గంటల నుంచే ప్రారంభమవుతుందని, ప్రజాప్రతినిధులు,పార్టీ శ్రేణులు హాజరుకావాలని కోరారు.

నేడు జగనన్న సురక్ష

సైదాపురం: ఊటుకూరులో గురువారం జగనన్న సురక్ష నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఓజిలిలో..

ఓజిలి: స్థానిక సచివాలయంలో బుధవారం జగనన్న సురక్ష నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రజనీకాంత్ తెలిపారు. చివరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కూలీల సంఖ్య పెంచాలి

సైదాపురం: ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఉపాధి సిబ్బందితో సమీక్షించారు. సిబ్బంది క్షేత్ర స్థాయిలో పని ప్రదేశాన్ని పరిశీలించి గ్రామాభివృద్ధికి ఉపయోగపడేలా పనులను చేయించాలన్నారు. కూలీలు పనిచేసే చోట సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఉపాధి పనులకు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.

అమర జవాన్లకు గుర్తుగా మొక్కలు నాటారు


మొక్కలు నాటుతున్న విద్యార్థులు

రాపూరు: కార్గిల్ విజయ్ దివాస్ కార్యక్రమంలో భాగంగా బుధవారం రాపూరు పశువర్ధక పాలిటెక్నిక్ విద్యార్థులు కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ప్రిన్సిపల్ ఇందిర మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో అమరులైన భారత సైనికులకు గుర్తుగా వారికి నివాళులర్పించి కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటినట్లు తెలిపారు. కళాశాల సిబ్బంది శ్రీహరి, విశాలి, చంద్రశేఖర్, గురవయ్య పాల్గొన్నారు.

రాపూరులో పీర్ల ఊరేగింపు

రాపూరు: రాపూరులో పీర్ల పండుగ సందర్భంగా బుధవారం రాత్రి గొడుగు పీరును ఊరేగించారు. స్థానికంగా మూడు పీర్ల చావడిలు ఉన్నాయి. వీటిల్లో మొదటి రోజు అన్ని చావడిల నుంచి గొడుగు పీర్లు ఊరేగిస్తారు. గురువారం పెద్ద పీర్ల చావడి వద్ద గుండం, శుక్రవారం ఉదయం పీర్ల ఊరేగింపు, అలాగే ఆరోజు రాత్రి మిగిలిన రెండు చావడిల్లో గుండం, శనివారం పీర్ల ఊరేగింపు జరుగనుంది.

వేడుకగా మహా హోమం

పెళ్లకూరు: చిల్లకూరు వడ్డిపాళెం చండికాపరమేశ్వరి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం వేదపండితులు మహాహోమం నిర్వహించారు. ఇందులోభాగంగా వేదపండితులు అమ్మవారికి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ప్రభావతమ్మ దంపతులు, ఆలయ ధర్మకర్త రాజమాతాదేవి పాల్గొన్నారు.

గరుడ వాహనంపై శ్రీవారు



రాపూరు: పెంచలకోన పెనుశిల లక్ష్మీనరసింహస్వామి శనివారం చందనాలంకరణలో భక్తులకు బుధవారం దర్శనమిచ్చారు. బుధవారం స్వామివారి స్వాతి నక్షత్రం కావడంతో ఉదయం శ్రీవారి నిత్యకల్యాణ మండపంలో శాంతి హోమం, కల్యాణం నిర్వహించారు. సాయంత్రం బంగారు గరుడ వాహనంపై ఉత్సవ విగ్రహాన్ని కొలువు దీర్చి అలంకరించి ఆస్థాన సేవ నిర్వహించారు.

నాణ్యమైన విద్య..బలవర్ధక ఆహారం


సైదాపురం ఉన్నత పాఠశాల


మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

- ప్రతిష్టాత్మకంగా జగనన్న గోరుముద్ద
- పిల్లలకు మంచి ఆరోగ్యం, నాణ్యమైన విద్యే లక్ష్యం
- వారంలో మూడు రోజులు రాగి జావ
- ఐదు రోజులు కోడిగుడ్డు
- ఆనందం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

సైదాపురం: నాడు బడి అంటే పిల్లలు బోరున ఏడ్చేవారు..నేడు బడి అంటే బ్యాగు తగిలించుకుని సంతోషంగా పరుగులు తీస్తున్నారు. కారణం చూడ చక్కని యూనిఫాం, పాదాలకు సరిపడా షూస్, బ్యాగు నిండా బుక్స్, స్కూల్‌కు వెళ్లగానే రంగు రంగుల కొత్త ప్రపంచంలోకి అడుగుపెట్టిన అనుభూతి. వెంటనే నోరూరించే రాగిజావ..సరదాగా పాఠాలు చెప్పే ఉపాధ్యాయులు, మధ్యాహ్నం విందుభోజనంతో కూడిన పౌష్టికాహారం..అందుకే పిల్లలు ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లడానికి ఇష్టపడుతున్నారు. దీంతో ప్రతిరోజూ పాఠశాలల్లో పండుగ వాతావరణం నెలకొంటోంది.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల శాతం పెరగాలని, నాణ్యమైన చదువుతో పాటు పిల్లలకు పౌష్టికాహారం అందించాలన్న దృఢసంకల్పంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసింది. నాడు–నేడు పేరిట పాఠశాలలకు కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దిన ప్రభుత్వం పిల్లల చదువుల కోసం అమ్మఒడి, జగనన్న గోరుముద్ద పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోంది.

అలాగే విద్యార్థులకు బలవర్ధకమైన ఆహారం అందించడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నెలకొల్పవచ్చని భావించింది. ఇందుకు అనుగుణంగా మధ్యాహ్న భోజన పథకాన్ని మరింత మెరుగుపరచి జగనన్న గోరుముద్ద పేరిట పోషకాహారాన్ని అందిస్తోంది. పేద విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడకుండా ప్రభుత్వమే రూ.కోట్లు వెచ్చించి బలవర్ధకమైన ఆహారాన్ని పిల్లలకు అందేలా చూస్తోంది. సైదాపురం మండలంలో 88 పాఠశాలలు ఉండగా ఐదు వేల మంది విద్యార్థులు జగనన్న గోరుముద్ద పథకం కింద మధ్యాహ్న భోజనం తింటున్నారు. పిల్లలకు మంచి ఆరోగ్యంతో పాటు నాణ్యమైన విద్య అందేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జగనన్న గోరుముద్ద మెనూ...

- **సోమవారం:** వెజ్ పలావ్, కోడిగుడ్డు, కూర, పొంగల్, చట్నీ, చిక్కీ
- **మంగళవారం :** రాగిజావ, పులిహోర, టమాట పచ్చడి, దొండకాయ పచ్చడి, కోడిగుడ్డు
- **బుధవారం:** వెజ్‌పలావ్, బంగాళాదుంప కుర్మా, చట్నీ, కోడిగుడ్డు, చిక్కీ
- **గురువారం :** రాగిజావ, సాంబార్ బాత్, చట్నీ, కోడిగుడ్డు
- **శుక్రవారం:** అన్నం, ఆకుకూర పప్పు, గుడ్డు,చిక్కీ
- **శనివారం:** రాగిజావ, ఆకుకూరతో అన్నం, పప్పుచారు, కోడిగుడ్డు, తీపి పొంగల్

రాగిజావ ఎంతో ఇష్టం



రాగిజావ అంటే నాకు ఎంతో ఇష్టం. ప్రార్థన పూర్తవగానే అందరం క్యూలో రాగిజావ తీసుకుంటున్నాం. రోజూ గుడ్డు పెడుతున్నారు. రోజు మార్చి రోజు చిక్కీ కూడా ఇస్తున్నారు. మధ్యాహ్న భోజనం కడుపు నిండా తింటున్నాం. – ఈదల వెంకటలక్ష్మి దీక్షిత, 10వతరగతి, సైదాపురం

జగనన్న గోరుముద్ద బాగుంది



జగనన్న గోరుముద్ద అంటూ పెడుతున్న భోజనం ఎంతో బాగుంది. మాపాఠశాల ఎంతో బాగుంటుంది. రంగురంగు బొమ్మల మధ్యన చక్కగా చదువుకుంటున్నాం. విద్యార్థుల సంక్షేమానికి కృషిచేస్తున్న సీఎం జగన్ మామకు ధన్యవాదాలు. ఇంట్లో కూడా లేని విధంగా నూతన మధ్యాహ్న భోజన మెనూ ప్రవేశపెట్టారు. – జక్కల మస్తానమ్మ, 10వతరగతి, సైదాపురం ఉన్నత పాఠశాల

పకడ్బందీగా జగనన్న గోరుముద్ద



జగనన్న గోరుముద్ద పకడ్బందీగా అమలు చేస్తున్నాం. వారంలో మూడు రోజులు రాగిజావ అందిస్తున్నాం. ప్రతి పాఠశాలలో మెనూ ప్రకారం వంటలు చేసేలా హెచ్‌ఎంలు, పీఎంసీ చైర్మన్లు పర్యవేక్షిస్తుంటారు. ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ రుచి, శుభ్రతపై తగిన జాగ్రత్తలు వహిస్తున్నాం. –దయాకర్, ఎంఈఓ, సైదాపురం

కష్టకాలంలో ఆత్మబంధువులా..


డీవీ సత్రంలో కోవిడ్ పరీక్షలు చేయిస్తున్న వలంటీర్ పురుషోత్తం (ఫైల్)

దొరవారిసత్రం: కోవిడ్ సమయంలో నా అనే వారు సైతం ఏవరు ముందుకురాని పరిస్థితిల్లో మేమున్నామంటూ వలంటీర్లు ముందుకొచ్చి ఆపన్నహస్తం అందిస్తూ ఆత్మబంధువుల్లా సేవలందించారు. డీవీసత్రం పీహెచ్‌సీ పరిధిలోని పలువురు వలంటీర్లు కోవిడ్ నిర్ధారణ పరీక్షలు సమయంలో వలంటీర్ల దగ్గర ఉండి పరీక్షలు చేయించారు. పాజిటివ్ వచ్చిన వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అవసరమైన మందులను, సరుకులను వారి ఇళ్లకు వెళ్లి అందించారు. రెడ్ జోన్ ప్రాంతాల్లో ప్రాణాలకు తెగించి శానిటైజేషన్ చేయించారు. కోవిడ్ వారియర్స్‌గా నిలిచి అందరి మన్ననలు పొందారు.

అందరిని చైతన్య పరిచారు



కోవిడ్ పరీక్షల సమయంలో వలంటీర్లు ప్రజలను చైతన్య పరిచి పరీక్షలు చేయించుకునే విధంగా కృషిచేశారు. కోవిడ్ బారిన పడకుండా అవగాహన కల్పించి ప్రజలను కాపాడారు. కోవిడ్ సోకిన వారిని గుర్తించి ప్రాణాలు కాపాడి వలంటీర్లు ఎంతో సేవ చేశారు. వారి సేవలు మరువలేనివి. –ఎన్ మధుసూదన్‌రెడ్డి, డీవీ సత్రం

ఆర్చరీ విజేతకు సన్మానం


గణేష్‌ను సన్మానిస్తున్న మంత్రి రోజా

పెళ్లకూరు: ప్రపంచ ఆర్చరీ పోటీల్లో అండర్–18 విభాగంలో సిల్వర్ మెడల్ సాధించిన తిరుమూరు గణేష్ మణిరత్నంను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజనాభివృద్ధిశాఖ మంత్రి ఆర్‌కే రోజా బుధవారం సన్మానించి అభినందనలు తెలిపారు. నాయుడుపేటకు చెందిన హరిప్రసాద్, సుప్రియ దంపతుల కుమారుడు గణేష్ మణిరత్నం ఇటీవల ఐర్లాండ్‌లో జరిగిన ప్రపంచ ఆర్చరీ పోటీల్లో అండర్–18 విభాగంలో సిల్వర్ మెడల్ సాధించాడు. విషయం తెలుసుకున్న మంత్రి రోజా నగరిలోని ఆమె నివాసానికి గణేష్ మణిరత్నంను పిలిపించుకుని సన్మానించి అభినందనలు తెలిపారు. నగరి నియోజకవర్గ పార్టీ పరిశీలకులు చిందేపల్లి మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

సామర్థ్యాలను మెరుగుపరచాలి


మాట్లాడుతున్న రిసోర్స్ పర్సన్

దక్కిలి: విద్యార్థులకు సృజనాత్మకంగా బోధన చేస్తూ, వారి సామర్థ్యాలను మెరుగుపరచాలని ఎంఈఓ–2 జగదీష్ తెలిపారు. దక్కిలి హైస్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు బుధవారం శిక్షణ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నూతన సాంకేతికతతో విద్యార్థులకు మెరుగైన బోధన చేపట్టాలన్నారు. ప్రతి విద్యార్థి తెలుగులో చదవడం, రాయడం, గణితాన్ని సులభంగా నేర్పించడమే శిక్షణ ఉద్దేశం అన్నారు. రిసోర్సు పర్సన్‌గా డి.పెంచలయ్య వ్యవహరించారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం నాగరాజు, సీఆర్పీ అనిత పాల్గొన్నారు.

భవనాల ప్రారంభం రేపు

- ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు


వైద్యాధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరురూరల్: చిల్లకూరులో నిర్మించిన పీహెచ్‌సీని ఈనెల 28వ తేదీ శుక్రవారం ప్రారంభించి ప్రజలకు అంకితం చేయనున్నట్లు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు తెలిపారు. అదేవిధంగా డాక్టర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో నూతనంగా నిర్మించిన అదనపు భవనాలను ప్రారంభిస్తామన్నారు. ఈమేరకు బుధవారం గూడూరులోని ఎమ్మెల్యే నివాసంలో వైద్యాధికారులు, గురుకులం ప్రిన్సిపల్‌తో చర్చించారు. అనంతరం మిట్టాత్మకూరు గ్రామానికి చెందిన ప్రజలు తమకు శ్మశానం లేక అవస్థలు పడుతున్నామని, స్థలం కేటాయించాలని కోరడంతో సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించామని తెలిపారు. గూడూరు వైస్ ఎంపీపీ మెడనూలు శ్రీనివాసులురెడ్డి, మనుబోలు కృష్ణయ్య, యల్లా శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

పరామర్శ


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

కోట: కోట మండలం కర్లపూడిలో అనారోగ్యంతో మృతిచెందిన వైఎస్సార్‌సీపీ నేత, సిద్దవరం సొసైటీ మాజీ చైర్మన్ సన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి మృతదేహానికి బుధవారం గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు నివాళులర్పించారు. ఆయన సోదరుడు సన్నారెడ్డి చెంచురాఘవరెడ్డిని పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. నివాళులర్పించిన వారిలో నేతలు రాజగోపాల్‌రెడ్డి, చంద్రభూషన్‌రెడ్డి, మొబీన్‌బాషా ఉన్నారు.

నివాళి


మృతుని భార్యకు ఆర్థికసాయం అందిస్తున్న ఏపీఓ

పెళ్లకూరు: చెంబేడు గ్రామానికి చెందిన ఉపాధి హామీ క్షేత్ర సహాయకుడు మూరతొట్టి నాగూరయ్య(51) కుటుంబసభ్యులను బుధవారం అధికారులు, నేతలు పరామర్శించారు. ఉపాధిహామీ క్షేత్ర సహాయకుడుగా పనిచేస్తున్న నాగూరయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలిసి ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, ఎంపీడీఓలు ప్రమీలారాణి, సురేష్‌బాబు, స్థానిక సర్పంచ్ ధర్మయ్య, ఏపీఓ దయానంద్, జేసీఎస్ కన్వీనర్ రఘునాయుడు, ఆశాఖ సిబ్బంది చెంబేడుకు చేరుకుని నాగూరయ్య పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబసభ్యులకు ఉపాధి హామీ తరఫున రూ15.వేల ఆర్థికసాయం అందించారు. మృతునికి భార్య రాజేశ్వరి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

పొడలుంటే పరీక్షలు చేసుకోండి

దక్కిలి: శరీరంలో స్పర్శ లేని పొడలు ఉంటే వెంటనే సమీపంలో ఉన్న పీహెచ్‌సీలో వైద్యపరీక్షలు చేయించుకోవాలని తిరుపతి డీపీఎంఓ రాజేంద్రప్రసాద్ ప్రజలకు సూచించారు. దక్కిలి పీహెచ్‌సీలో బుధవారం కుష్టు, క్షయ వ్యాధి గ్రస్తులకు సంబంధించిన వివరాలను ఆయన పరిశీలించారు. లెప్రసీ జోనల్ కోఆర్డినేటర్ సతీష్, వైద్యాధికారిణి బిందుప్రియాంక పాల్గొన్నారు.

బందోబస్తు నడుమ కారూరు జాతర ప్రారంభం


గ్రామంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు


అమ్మవారికి నైవేద్యం సమర్పించేందుకు తరలివచ్చిన భక్తులు

తడ: వివాదం నడుమ కారూరు గ్రామంలో బుధవారం నుంచి ప్రారంభమైన చెల్లాతమ్మ అమ్మవారి జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా సూళ్లూరుపేట సీఐ వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో భారీ ఎత్తున పోలీస్ బలగాలు మోహరించి జాతర నిర్వహణకు ప్రజల్లో భరోసా కల్పించారు. దీనికి సంబంధించిన వివరాలు..జాతర నిర్వహిస్తే అక్కడి సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకులకు పేరు వస్తుందన్న కుయుక్తితో టీడీపీ నాయకులు కొందరు జాతరను అడ్డుకునే ప్రయత్నం చేశారు. గ్రామంలో గొడవలు జరుగుతాయని జాతరను ఆపాలనే ప్రయత్నం చేశారు. దీనిపై నాయుడుపేట డీఎస్పీ, సూళ్లూరుపేట ఆర్డీఓ నేతృత్వంలో రెండు రోజుల క్రితం తడ తహసీల్దార్ కార్యాలయంలో ఇరువర్గాలతో శాంతి సమావేశం ఏర్పాటు చేసి చర్చలు జరిపారు. టీడీపీ నాయకులు అధికారుల మాటలు పెడచెవిన పెట్టి జాతర ఆపాల్సిందేనని భీష్మించుకోవడంతో అధికారులు సమావేశాన్ని వాయిదా వేశారు. జాతరకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన నేపథ్యంలో భక్తుల మనోభావాలను పరిగణలోకి తీసుకున్న ఉన్నతాధికారులు గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా సీఐ, ఐదుగురు ఎస్ఐలు, 20 మంది స్పెషల్ పార్టీ సిబ్బంది సహా మొత్తం 60 మంది పోలీసులను మోహరించారు. బుధవారం గ్రామంలో కవాతు నిర్వహించిన పోలీసులు గ్రామస్తులకు భరోసా కల్పించడంతో జాతరకు మహిళలు పెద్ద ఎత్తున తరలి వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. రాత్రికి అమ్మవారి గ్రామోత్సవం ఉండడంతో పోలీసులు గ్రామంలోని అన్ని కూడళ్లలో మోహరించి పరిస్థితిని గమనిస్తున్నారు.

అరబిందోఫార్మాకు 12 మంది ఎంపిక


జాబ్‌మేళాలో ఎంపికైన విద్యార్థులు

నాయుడుపేట: నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జేకేసీ ఆధ్వర్యంలో అరబిందో ఫార్మా కంపెనీలో పనిచేసేందుకు బుధవారం జాబ్‌మేళా నిర్వహించారు. హైదరాబాద్, విశాఖపట్టణం, మేనకూరు కంపెనీల్లో పనిచేసేందుకు నిరుద్యోగులకు జాబ్‌మేళా నిర్వహించారు. ఇందులో 12 మంది ఎంపికయ్యారు. జాబ్‌మేళాలో జేకేసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఆర్ వాసప్ప, ప్రిన్సిపల్ డాక్టర్ మధుసూదన్‌వర్మ పాల్గొన్నారు.

మణిపూర్ దోషులను శిక్షించాలి

గూడూరురూరల్ : మణిపూర్‌లో జరుగుతున్న హింసాత్మక ఘటనలకు కారణమైన వారిని కఠినంగా శిక్షించి అక్కడ సాధారణ పరిస్థితులు నెలకొల్పేలా కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని సీపీఎం సెంట్రల్ కమిటీ కార్యదర్శి జోగి శివకుమార్ డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం సీఐటీయూ కార్యాలయం నుంచి మున్సిపల్ కార్మికులు, సీఐటీయూ నాయకులు, మహిళలతో కలిసి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం టవర్‌క్లాక్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గోపీనాథ్, పట్టణ ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు, కార్యదర్శి సురేష్, కె.వి.పి.ఎస్. పట్టణ నాయకులు ప్రసాద్ పాల్గొన్నారు.

వెంకటగిరిరూరల్: మణిపూర్‌లో జరిగిన ఘటనకు ఖండిస్తూ పట్టణంలో రైతు కూలీ సంఘం, స్త్రీవిముక్తి సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమణయ్య, జిల్లా నాయకులు జి కృష్ణారెడ్డి ప్రజాతంత్ర చేనేత కార్మికుల సంఘం అధ్యక్షుడు చిన ఓబయ్య, స్త్రీవిముక్తి సంఘటన నాయకురాలు ఝాన్సీ, రిషిత, ధనలక్ష్మి పాల్గొన్నారు.

తడ పంచాయతీ కార్యాలయం తనిఖీ


డీపీఓను సన్మానిస్తున్న సర్పంచ్

తడ: జిల్లా పంచాయతీ అధికారి ఏ రాజశేఖర్‌రెడ్డి, బుధవారం తడ పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆర్ముగం డీపీఓకి శాలువా కప్పి స్వాగతం పలికి సన్మానించారు. పంచాయతీ కార్యాలయాన్ని పరిశీలించిన డీపీఓ సిబ్బందితో మాట్లాడారు. రానున్నది వర్షాకాల సీజన్ కావడంతో పంచాయతీ సిబ్బంది గ్రామాల్లో పారిశుధ్య పనులను ఎప్పటికప్పుడు చేపట్టాలని ఆదేశించారు. పంచాయతీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

జగనన్న సురక్షకు అపూర్వ స్పందన


కలవకూరులో లబ్ధిదారులతో నేతలు, అధికారులు


సిద్ధవరంలో..


వాకాడులో..

పెళ్లకూరు: మండలంలోని కలవకూరు గ్రామంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, తహసీల్దార్ రామయ్య, ఎంపీడీఓ సురేష్‌బాబు, సర్పంచ్ చెంచురామయ్య, జేసీఎస్ కన్వీనర్ రఘునాయుడు, కార్యదర్శి మధుమోహన్, నేతలు గురవయ్య, రామయ్య, చిరంజీవి, అధికారులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో 11 రకాల సేవలు

కోట: సిద్ధవరంలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. 642 మంది లబ్ధిదారులకు ఎంపీపీ దాసరి అంజమ్మ చేతులమీదుగా సర్టిఫికెట్లను అందజేశారు. ఎంపీడీఓ భవాని, సర్పంచ్ సుజాత, ఎంపీటీసీ పోలమ్మ, రామయ్య పాల్గొన్నారు. కోట–3 సచివాలయం పరిధిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో తహసీల్దార్ పద్మావతి, ఎంపీటీసీ సభ్యుడు మొబీన్‌బాషా చేతులమీదుగా లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందజేశారు.

జగనన్న సురక్షతో ప్రభుత్వ సేవలు

వాకాడు: స్థానిక సచివాలయం–1 పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారులకు అవసరమైన ధ్రువీకరణపత్రాలు అందజేశారు. వాకాడు పీఏసీఎస్ అధ్యక్షుడు కొడవలూరు దామోదర్‌రెడ్డి, తహసీల్దార్ నరసింహారావు, ఎంపీడీఓ గోపీనాథ్, జెడ్పీటీసీ సభ్యుడు రౌతు రామకృష్ణ, సర్పంచ్ వెంకటరత్నమ్మ, ఉప సర్పంచ్ పాపారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ వాకాటి నాగభూషణమ్మ, పాల్గొన్నారు.

సూళ్లూరుపేట రూరల్‌లో...

సూళ్లూరుపేట రూరల్: మండలంలోని మంగానెల్లూరు సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. తహసీల్దార్ కన్నంబాకం రవికుమార్ పాల్గొన్నారు.

ఓటరు నమోదు త్వరితగతిన పూర్తిచేయాలి


మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసరావు

నాయుడుపేటటౌన్: పురపాలక సంఘ పరిధిలో ఓటరు నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయాలని మున్సిపల్ కమిషనర్ ఐ.శ్రీనివాసరావు ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ఆయన బీఎల్‌ఓలతో సమీక్ష నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని 37 మంది బీఎల్‌ఓలు వారి పోలింగ్ స్టేషన్‌ల పరిధిలో ఈనెల 21 నుంచి ఓటరు వెరిఫికేషన్ ప్రక్రియ చేస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 21 తేదీలోపు పూర్తిచేయాలని ఆదేశించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ షాజహాన్, గోవర్ధన్ పాల్గొన్నారు.

సులభరీతిలో విద్యాబోధన అందించాలి


మాట్లాడుతున్న డైరెక్టర్ మస్తానయ్య

వెంకటగిరిరూరల్: విద్యార్థులకు అర్థమయ్యేలా ఉపాధ్యాయులు సులభరీతిలో విద్యాబోధన అందించాలని స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ మేనేజ్‌మెంట్ ఆఫ్ ట్రైనింగ్ డైరెక్టర్ వీఎస్ మస్తానయ్య తెలిపారు. పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రాథమిక స్థాయి పాఠశాల సముదాయపు సమావేశాన్ని పరిశీలించారు. అనంతరం జగనన్న విద్యాకానుక పుస్తకాల పంపిణీ, జగనన్న గోరుముద్ద గురించి విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ఎంఈఓ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.